కథా నిలయం
శ్రీకాకుళం

# పుణ్యకాలం మించిపోయింది!

— సోదుం జయరాం

"మీరు ఒక కథ రాయకూడదా!" అంది వరలక్ష్మి ఒక శుభో దయాన.

శ్రీమతి అభ్యర్థన విన్న గోపాలక్రిష్ణకు ఆశ్చర్యం కలిగింది. రెండేళ్ళకుపూర్వం ఎప్పుడన్నా వరలక్ష్మి ఇట్లా అడిగివుంటే ఆనంద పారవశ్యం అనుభవించేవాడు అతను. ఆ రోజులు పోయాయి. కారణాలు ఏమైతేనేం కానీ - చాలా రోజులుగా అతను కథలు రాయడమే మానుకున్నాడు. గతంలో తనూ ఒక కథకుడినన్న జ్ఞాపకాలుకూడా మెల్లమెల్లగా మరుగున పడుతున్నాయి.

ఈ స్థితిలో వరలక్ష్మి "ఒక కథ రాయకూడదా?" అని అడిగింది. చిత్రమేమిటంటే, తను కథలు రాస్తున్న రోజుల్లో, వరలక్ష్మికి తన కథలు కొబట్టలేదు. కొబట్టనందుకు అతనెప్పుడూ బాధపడలేదు. బాధాకరమైందేమిటంటే, అప్పట్లో వరలక్ష్మి ప్రవర్తన. గోపాలక్రిష్ణ కథలు రాయడం-వరలక్ష్మికి ఏమాత్రం గిట్టేదికాదు అర్థరాత్రిదాకా అపరాత్రిదాకా

రాస్తూ కూచుంటే "కరెంటు దండగ. ఆ రాసేదేదో ఉదయం రాసుకో వచ్చు. లైట్ ఆఫ్‌చేసి పడుకుందురూ" అని విసుక్కునేది.

"కూటికి రావాలా? గుడ్డకు రావాలా? ఆ పొద్దుపోని రాతలు మానుకోండి" అని మండిపడేది !

అట్లాంటి వరలక్ష్మి ఇప్పుడు కథ రాయమని అభ్యర్థించడం నిజంగానే గోపాలక్రిష్ణకు ఆశ్చర్యం కలగజేసింది.

"ఏమిటి విశేషం వరలక్ష్మీ?" అన్నాడు గోపాలక్రిష్ణ.

"రాస్తానని మాట యివ్వండి" అంది ముసిముసి నవ్వులు నవ్వుతూ వరలక్ష్మి.

"మాట్లడిగినై. ఇంకా నేను రాసేదేమిటి?" అన్నాడు గోపాలక్రిష్ణ నవ్వుతూ.

"మీ పరాచికాలు చాల్లెండి. చిన్న కథ ఒకటి రాయడం బ్రహ్మవిద్యా? కూర్చుంటే అర్ధగంటలో రాసిపారేస్తారు. నా మాటవిని రాయండి" అంది ప్రాధేయపూర్వకంగా.

కొంతమందికి రాయడం కష్టమైతే, మరికొంతమందికి రాయకుండా వుండడం కష్టం అన్న సామర్‌సెట్ మామ్ మాటలు గోపాలక్రిష్ణ జ్ఞాపకం వచ్చింది. తను మొదటి కోవకు చెందినవాడు. ఇట్లాంటి విషయాలు వరలక్ష్మితో చర్చించి ప్రయోజనంలేదు.

"సరే ఇంతకూ ఏమిటి విశేషం" అన్నాడు గోపాలక్రిష్ణ.

"చెబుతా నుండండి" అంటూ చెంగున యింట్లోకి పరుగెత్తి, ఏదో వారపత్రికతో ప్రత్యక్షమైంది. గబగబా పేజీలు తిప్పి "ఇదిగో యీ ప్రకటన చూడండి" అంటూ వారపత్రిక గోపాలక్రిష్ణ చేతిలో వుంచింది.

దీపావళి కథల పోటీకి సంబంధించిన ప్రకటన అది.

"చూశారా! మొదటి బహుమతి ఎంతో!" అంది కళ్లు ఇంతవి చేసి. ఆ కళ్ళలో ఆశ్చర్యం, ఆశ రెండూ తొణికిసలాడుతున్నాయి.

గోపాలక్రిష్ణకు నవ్వు వచ్చింది.

"ఏం మనుషులండీ మీరు, పాతికా కాదు, పరకా కాదు, రెండు వేలు బహుమతి! మీకేమో నవ్వులాటలుగా వుంది. కథ రాయరా?" అంది దీనంగా.

"అదికాదు వరలక్ష్మీ! ప్రొఫెషనల్ మోరల్స్ అనేవి కొన్ని వున్నాయి. అదీ నా బాధ."

"అంటే?"

"అంటే ఏం లేదు. డాక్టరున్నాడనుకో – అతని వృత్తిధర్మం జబ్బుల్నుండి మనుష్యుల్ని రక్షించడం. ఈ బాధ్యతలో అతడు కేవలం డబ్బుకీ వృత్తికీ లంకె పెట్టకూడదు, రచయిత అయినా అంతే. కేవలం డబ్బుకోసమని గడ్డి కరవకూడదు."

"మాటలకేం లెండి, ఈ రోజుల్లో డాక్టర్లకూ, లాయర్లకూ, అందరికీ డబ్బురంధి తప్ప మరొకటి లేదు. మీలాటి అమాయకులే ఆదర్శాలు మాట్లాడుతారు."

వరలక్ష్మి అన్న మాట వాస్తవమే. డాక్టరుకు రోగీ, లాయరుకు క్లయింటు – డబ్బు సంపాదించడానికి సాధనాలు తప్ప మరేమీ కాదు, రచయిత వృత్తికూడా అలాగే అయిపోతూంది.

"మనకుమాత్రం డబ్బుచేదా? రాయండి. ఏ పుట్టలో ఏపాముందో ఎవరు చూచారు? మీ కథకే ప్రథమ బహుమతి రావచ్చు" అంది మళ్ళీ వరలక్ష్మి.

"చూద్దాంలే" అన్నాడు గోపాలక్రిష్ణ.
మాట అనడమైతే అన్నాడు కానీ - పోటీకి కథ రాయాలన్న ధ్యాస అతనికి ఏ కోశానా లేదు. అందులోవున్న సాధక బాధకాలు అతనికి తెలియనివి కావు. ప్రజల అజ్ఞానం ఆసరాగా బ్రతుకుతున్న వారపత్రికలు; వాటికి ఎట్లాంటి కథలు నచ్చుతాయో - గోపాలక్రిష్ణ చూడందీ కాదు. బహుమతి మొత్తం చూచి కళ్ళు జిగేలుమని, వరలక్ష్మి ఏదో అడిగింది కానీ దాన్ని అదేపనిగా సాగదీస్తుందని - గోపాలక్రిష్ణ ఊహించలేదు. రాత్రి భోజనం చేస్తుండగా వరలక్ష్మి "చెవుల్లోకి రింగులు కావాలని మాధవి ఉదయంనుంచి పోరుపెట్టి ఏడుస్తోందండీ" అంది.

ఆ పిల్లకు యింకా ఐదేళ్ళు నిండలేదు. అప్పుడే దానికి సొమ్ముల మీద మోజు. ఆడపిల్లలు పుట్టడంతోటే ఆభరణాలమీద మోజుతో పుడతారేమో ననిపించింది గోపాలక్రిష్ణకు.

"రెండుకో మూడుకో మంచివి రోల్డుగోల్డువి వస్తాయి. తీయించలేకపోయావా?"

"మీరు బొత్తిగా హృదయం లేని మనుషులు. ఐదో యేట దానికి మొదటిసారిగా చెవులు కుట్టిస్తూ, రోల్డుగోల్డువి తగిలించాలా? ఈ మాట అనడానికి మీకు నోరు ఎలా వస్తోందండీ?"

"బంగారువే కాదు, ఖరీదయిన ముత్యాలు తాపినవి కొనాలనికూడా వుంది. డబ్బు వుండాలా లేదా?"

"డబ్బు దానంతటదే నడిచి మీ దగ్గరికి వస్తుందా?"

"నేనే దానిదగ్గరకి నడచివెళ్తాను. ఆ మార్గమేదో చెప్పరాదూ?"

నేను చెబితే మీ చెవికెక్కుతుందా? కథ రాయండి అని మొత్తు కుంటుంటే మీకు చీమ కుట్టినట్టన్నా లేదు."

అదీ మార్గం! ఆ మార్గం చెప్పడంలో వరలక్ష్మి నేర్పు గోపాల కిష్టను ఆశ్చర్యం కలగజేసింది. నేరుగా విషయంలోకి దిగకుండా, పిల్లదాని ఇయర్ రింగ్స్‌తో మొదలుపెట్టడం, మధ్యలో హృదయం ప్రసక్తి తెచ్చి సెంటిమెంటుమీద ప్లే చెయ్యడం, ఆ తర్వాత కథ రాయమని అడగటం – ఇదంతా చూస్తే రచయిత్రికి కావలసిన లక్షణాలు – వరలక్ష్మిలో కూడా వున్నవేమోననిపించింది గోపాలక్రిష్టకు.

"నువ్వే కథ ఒకటి ఎందుకు రాయకూడదు వరలక్ష్మీ. కథ రాయ దానికి నీకున్న పరిజ్ఞానం చాలు. ప్రతిభ పాళ్ళు కొంచెం ఎక్కువైతే, పత్రికలవాళ్ళకీ జీర్ణం కాదు. పాఠకులకీ జీర్ణంకాదు. నీలాటివాళ్ళ అవ సరం యిప్పుడు దేశంలో చాలావుంది" అన్నాడు గోపాలక్రిష్ట నవ్వుతూ.

"మీ సరసాలు కట్టిపెట్టి, అన్నం తినగానే రాయడానికి కూర్చోండి. కాగితాలు, పెన్నూ అన్నీ టేబుల్‌మీద సిద్ధంగా పెట్టాను" అంది వరలక్ష్మి.

"ఏ తమిళనాడు లాటరీ టిక్కెట్టో కొని నీ అదృష్టం పరీక్షించుకోక నా ప్రాణమెందుకు తీస్తావు?"

"నన్నుద్ధరించడానికి మిమ్మల్ని కథ రాయమని బలవంతం చెయ్య డంలేదు. ఇంటి పరిస్థితు లెంత చెప్పినా మీకు అర్థం కావేం? వచ్చే జీతంలో మార్వాడీ వడ్డీకింద ఎంత పోతోందో, ఎంత మిగులుతోందో మీకు తెలియందా? తినీ తినకా ఛస్తున్నా, సంసారం గడవడం గగనమై పోతూంది. ఎప్పుడో చేసిన అప్పులు యీనాటికీ తీరే దారిలేదు. అయినా ఇవన్నీ మీతో అనడం నాదే బుద్ధి తక్కువ" అంది మూతి విరిచి.

ఇంటో పోరు ప్రారంభం కాకూడదు. అయ్యాక దాని పరిణామాలు ఎలా వుంటాయో గోపాలక్రిష్ణకు తెలియంది కాదు. పరిస్థితులు అందాకా విషమించకుండా – వరలక్ష్మి మాట పాటించి, ఒక పట్టుపట్టి చూడటమే మేలు అనుకున్నాడు గోపాలక్రిష్ణ. అన్నం తినగానే వెళ్ళి టేబుల్ ముందు కూచున్నాడు.

వరలక్ష్మి చెప్పినట్టు అన్నీ సిద్ధంగా వున్నాయి.

మెదడుమాత్రం పనిచెయ్యడానికి సిద్ధంగా లేనంటోంది. చిన్నప్పుడు ప్రైవేట్ ట్యూషన్‌కు టీచరు యింటి దగ్గరికి వెళ్ళే దినాలు జ్ఞాపకానికి వచ్చాయి గోపాలక్రిష్ణకు.

వరలక్ష్మి భోంచేసి, ఇల్లు సర్ది బయటకు వెళ్తూ గోపాలక్రిష్ణ గదిలోకి తొంగిచూచింది. చెప్పినట్టు విని బుద్ధిమంతుడిలా రాయడానికి కూర్చున్నాడు. వరలక్ష్మి ముఖం విప్పారింది.

"టేబుల్ సొరుగులో సిగరెట్టు పెట్టెలున్నాయి. ఫ్లాస్కులో కాఫీ మూడు కప్పులు పోశాను. చాలుగదా?" అంది.

"చాలు."

"చెప్పడం మరిచాను. గడువు నాలుగు రోజులే వుంది. ఆ పత్రిక ముందన్నా నా కంటపడిందకాదు" అంది నొచ్చుకుంటూ.

"ఇన్‌స్పిరేషన్ వుంటే ఎంత సేపు వరలక్ష్మీ? ఏడుస్తూ రవికముడి విప్పడమంటారే – అట్లావుంది నా పరిస్థితి."

"మీరూ, మీ బూతుమాటలూ! ఇన్‌స్పిరేషన్ రావడానికి ఏం కావాలి?" అంది నవ్వుతూ.

కథా నిలయం

"అదిగో, ఆ అలమరాలో కథల పుస్తకాలు వున్నాయి. అవి ఇట్లా పడెయ్. అవి చదివితేనన్నా ఇన్‌స్పిరేషన్ వస్తుందేమో చూస్తాను" అన్నాడు గోపాలక్రిష్ణ.

పై ఉద్యోగి మాట సబార్డినేట్ శిరసావహించినట్టు, వరలక్ష్మి గబ గబా వెళ్ళి కథల పుస్తకాలు తెచ్చి టేబిల్‌మీద వేసి వెళ్ళిపోయింది.

చాలా సేపు చదువుతూ కూర్చున్నాడు. ఏదన్నా చదువుతూ కూర్చుంటేనన్నా ఇన్‌స్పిరేషన్ వస్తుందేమోనని ఆశ. కాని అదేం లాభించలేదు. తను రాయదలచిన్నది – రెక్కలు విరిగిన పక్షి ఎగరడానికి ప్రయత్నించినట్టుగా వుంది. తలలో ఏదో శూన్యం! ఒకప్పుడు తను నిజంగా కథలు రాశాడా అనిపించింది. తనలోని రచయిత చచ్చిపోయాడేమో? ఎప్పుడు ప్రయత్నించినా తను యింక రాయలేడేమో? తన ఆశ లతమీద తనకే జాలివేసింది. ఏదో బాధ! టేబుల్‌మీద తలఆన్చి అలాగే పడుకున్నాడు.

పండ్రెండింటికి గదిలో అడుగుల చప్పుడైతే తలెత్తి చూచాడు. వరలక్ష్మి! ఆమే నిద్రపోలేదు. ఎవరిబాధ వారిది!

"కథ ఎందాకా వచ్చింది?"

"డైలాగులతో సహా అన్నీ తలలో వున్నాయి. కాగితంమీద పెట్టడమే తరువాయి, ఉదయం ఆ పని చేస్తాను వరలక్ష్మీ!" అంటూ ఒక చిన్న అబద్ధం ఆడాడు గోపాలక్రిష్ణ.

"పొద్దుపోయింది వచ్చి పడుకోండి" అంది వరలక్ష్మి.

పడుకున్నాడు కాని గోపాలక్రిష్ణకు నిద్ర రాలేదు. తను రాయలేని స్థితే జ్ఞాపకం వస్తోంది. తను యిట్లా బాధపడుతూంటే, వరలక్ష్మికేమొ బహు

మతి మొత్తం obsession లాగా తయారయింది. ఉదయం లేవగానే మళ్ళీ కథ అని వెంటపడుతుంది. బాధ....చిరాకు - వీటిమధ్య ఏ ఒంటి గంటకో నిద్రపట్టింది.

బాగా పొద్దెక్కిన తర్వాత లేచి పళ్ళు తోముకుంటున్నాడు.

వరలక్ష్మి రెండు ఉత్తరాలు పట్టుకొచ్చింది.

"ఎక్కడ్నుంచో, చదువు" అన్నాడు గోపాలక్రిష్ణ. వరలక్ష్మి ఒక కార్డుతీసి చదివి, "ఎవరో కేశవరావు అనే ఆయన రాశారండీ ఈ ఉత్తరం. కథా సంకలనానికి ఒక కథ రాసి పంపమంటున్నారండీ" అంది.

కథ అనగానే కంపం పట్టుకొచ్చింది. వరలక్ష్మితోనే ఏగలేక చస్తుంటే మళ్ళా ఇదొకటి. "సరేలే, ఆ ఉత్తరం ఎక్కణ్ణుంచో చదువు" అన్నాడు గోపాలక్రిష్ణ.

"చదువుతాను గానీ, కథరాసి పంపితే వీళ్ళేమైనా డబ్బు ఇస్తారా?" అని ప్రశ్నించింది వరలక్ష్మి.

"ఇవ్వరు."

"అయితే చేతిచమురు భాగోతమన్నమాట వీళ్ళకు కథ పంపకండి" అంది రెండో ఉత్తరం చదవడానికి మొదలుపెడుతూ.

పత్రికలవాళ్ళు పాతికో పరకో ముట్టజెపితే తీసుకున్నమాట వాస్తవమేకాని, డబ్బుకోసమని తను ఏనాడూ కథలురాయలేదు. రాయాలనిపించినపుడు రాశాడు. సామాజిక బాధ్యత నిర్వర్తించానే తృప్తి అనుభవించేవాడు. ఇప్పుడు అదీ దూరమైపోయింది. ఏదో బాధ గొంతులో ఉండలా అడ్డుపడింది గోపాలక్రిష్ణకు.

"అయ్యయ్యో" అంది బాధగా వరలక్ష్మి ఉత్తరం చదివి.

"ఏమైంది వరలక్ష్మీ" అన్నాడు గోపాలక్రిష్ణ.

"మీ అక్కకు సీరియస్‌గా వుందట. మీ మేనల్లుడు వాసు ఉత్తరం రాశాడు" అంది వరలక్ష్మి.

"తొమ్మిదింటికి బస్సువుంది మధ్యాన్నానికి చేరుకోవచ్చు. త్వరగా కాఫీ ఇవ్వు. వెళ్తాను" అన్నాడు ఆత్రంగా గోపాలక్రిష్ణ.

"కాఫీదేముంది. త్వరగా ముఖం కడుక్కోండి. మళ్ళా సాయంత్రానికి వస్తారుకదా ?"

కథ పంపడానికి గడువు నాలుగురోజులే వుందని రాత్రి వరలక్ష్మి అన్నమాట జ్ఞాపకం వచ్చింది. అందుకే సాయంత్రానికి ఇంటికి రా రా అని అడుగుతున్నదేమో! గోపాలక్రిష్ణకు జుగుప్స కలిగింది. అమితమైన కోపంవచ్చింది. గబగబా ముఖం కడుక్కొని కాఫీకూడా త్రాగకుండా బయలుదేరాడు.

గోపాలక్రిష్ణ వెళ్ళేసరికి అంతా అయిపోయింది.

"ఏమైందిరా వాసూ?" అన్నాడు గోపాలక్రిష్ణ గాద్గదికమైన గొంతుతో.

"మన పిచ్చిగాడి. అరవై ఏళ్ళునిండాయి. ఇంకా ఎన్నేళ్ళు బ్రతుకుతుంది మామా."

"గోపాల్ కనిపించడేం ?"

చెప్పుకుంటే సిగ్గుచేటు. అమ్మ తనపేరవున్న నాలుగెకరాల ఆస్తి పోయిన సంవత్సరం నా పేర రాయించింది. ఆ కోపంతో ఇప్పుడు కడసారి కళ్ళచూడటానికన్నా రాలేదు. ప్చ" అని చప్పరించాడు.

గోపాలక్రిష్ణ మనసు కలుక్కుమంది. కన్నతల్లి చనిపోతేకూడా చూడటానికి రానికొడుకు! నవమాసాలూ మోసి కనడం మాట అటుంచినా అతనికబ్బిన చదువూ, మంచి ఉద్యోగమూకూడా ఆమె శ్రమ ఫలితమే. నానా యాతనా పడి చదివించి ఉద్యోగస్తుణ్ని చేసింది, ఇంతాచేసినా పగ సాధిస్తున్నాడు!

చీకటిపడ్డాక దహన సంస్కారాలు పూర్తి అయ్యాయి. ఆ రోజు రాత్రికి అక్కడేవుండి మరుసటిరోజు వస్తున్నాడు గోపాలక్రిష్ణ. వూరి బయట శేషయ్య కనిపించాడు. గోపాలక్రిష్ణకు ఆయన కొంచెం దూరపు బంధువు.

"వెళుతున్నావా నాయనా?" అన్నాడు.

"ఇంకేముంది. అంతా అయిపోయింది. వెళుతున్నాను. అన్నాడు గోపాలక్రిష్ణ.

"కాలంతీరిన తర్వాత ఎవరూ ఇక్కడ పుట్టికట్టుకొని వూరేగేది లేదు, బాధేమిటంటే అవసాన దశలో ఆ మహా తల్లికి కొడుకులుండీ లేనట్లే అయింది"

"అవును, గోపాల్ చూడనన్నా రాలేదు."

"వాడు మనూష్, వీడుదుమ్మూ. వీడిక్కడవుండి ఉద్ధరించాడను కుంటున్నావా?" అన్నాడు శేషయ్య.

"ఏం? వీడు సరిగా చూడలేదా?" అన్నాడు ఆశ్చర్యంగా గోపాల క్రిష్ణ.

"చూచేవాడే. వీని తప్పులేదు. దరిద్రంలో వున్నాడని తన పేర వున్న నాలుగెకరాలు, ఆ మహాతల్లి వీడి పేర రాయడం తప్పయింది. అప్పట్నుంచి ఈమె చావుకు ఎదురుచూస్తూ కూచున్నాడు. పదిరోజులుగా జ్వరం. మందో మాకో ఇప్పించాలన్న ధ్యాసకూడా లేకపోయింది వీడికి."

గోపాలక్రిష్ణకు అక్కడ నిలబడి మాట్లాడాలనిపించలేదు. తల తిరిగినట్లుగావుంది బస్సులో కూర్చున్నాడు. శేషయ్య అన్న మాటలే జ్ఞాపకం వస్తున్నాయి. కడుపులో చేయిపెట్టి దేవినట్టుగా వుంది. డబ్బు.... అది రూపంలేని రాక్షసి! దాని కబంధ హస్తాల్లో-మమతలు, మమకారాలు బంధాలూ, అనుబంధాలు-అన్నీ వూపిరాడక చస్తున్నాయి. తల్లీ లేదు తండ్రీలేదు!

గోపాలక్రిష్ణ ఇంటికిరాగానే "ఎట్లావుంది పిన్నికి" అంది వరలక్ష్మి.

వెళ్ళేటప్పుడు వరలక్ష్మిమీద వున్న కోపం ఇప్పుడు లేదు. "చనిపోయింది" అన్నాడు బాధగా,

"కాళ్ళు కడుక్కొని భోంచేద్దురు రండి" అంది వరలక్ష్మి. ఆ మాట గోపాలక్రిష్ణకు వినిపించలేదు. దయ్యంపట్టినట్టు నడిచివెళ్ళి టేబుల్ ముందు కూచున్నాడు. చాలా రోజుల తర్వాత అతనిలోని రచయిత మేల్కొన్నాడు. వానికి ఇప్పుడు అన్నమూ, నీళ్ళూకాదు కావలసింది. లోపలిమంట బయటకు కక్కాలి. గోపాలక్రిష్ణ రాస్తూ కూర్చున్నాడు.

చాలాసేపటికి వరలక్ష్మి వెళ్ళి "భోం చెయ్యకుండా ఏం చేస్తున్నారు" అంది,

"కథ రాశాను వరలక్ష్మి" అన్నాడు గోపాల క్రిష్ణ.

"రేపు ఆదివారం. ఎల్లుండి కథపంపినా, గడువు లోపల చేరదు. పోనీ సంకలనానికి పంపుకోండి" అంది దిగులుగా.

అతని కళ్ళల్లో ప్రతిఫలిస్తున్న స్పిరిచువల్ శాటిస్ఫాక్షన్ ఆమె గమనించనేలేదు!

★ ★ ★